క్లుప్తంగా

1న వైకుంఠ వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం

కడప కార్పొరేషన్: కడప నగరం మద్రాసు రోడ్డులో సెంట్రల్ జైలు పక్కనున్న శ్రీ వైకుంఠ వెంకటేశ్వరస్వామి వారి కళ్యాణోత్సవం ఫిబ్రవరి 1న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు కె. విశ్వనాథ్, ఎం. సుదర్శన్ రెడ్డి, సుధీర్‌బాబు, బీవీ రమణారెడ్డి, మస్తాన్ రెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి ఉత్సవ మూర్తులకు పంచామృతాభిషేకం, వస్త్రాలంకరణ, 10 గంటల నుంచి ఎదుర్కోలు, కళ్యాణ మహోత్సవ కార్యక్రమం, మధ్యాహ్నం 12 గంటల నుంచి మంగళహారతి, తీర్థ ప్రసాద వినియోగం, సాయంత్రం 5 గంటల నుంచి స్వామి వారి గ్రామోత్సవం ఉంటుందని వివరించారు.

రేపటి నుంచి యోగా శిబిరం

కడప కల్చరల్ : కడప పటేల్‌రోడ్డులోని మిత్ర యోగా కేంద్రంలో ఫిబ్రవరి 1 నుంచి యోగా శిక్షణా శిబిరాన్ని నిర్వహిస్తున్నామని నిర్వాహకులు డాక్టర్ కె.కల్పన, డాక్టర్ కె.రంగనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు ఉదయం 5.30 నుంచి 7.00 గంటల వరకు, 10.30 నుంచి 11.45 గంటల వరకు మహిళలకు ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు.వివరాలకు 98488 61206, 70132 38986 నెంబర్లలో సంప్రదించాలని వారు సూచించారు.

ఒంటేరుకు ఏపీ బీసీడబ్ల్యూ ఆర్‌ఎస్‌టీయూ మద్దతు

కడప ఎడ్యుకేషన్: రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పశ్చిమ రాయలసీమ టీచర్స్ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న ఒంటేరు శ్రీనివాసులరెడ్డికి ఏపీ బ్యాక్‌వర్డు క్లాసెస్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ స్కూల్స్ టీచర్స్ యూనియన్ తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఫణీంద్రకుమార్, కార్యదర్శి బార్గవి ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ వెల్ఫేర్ రెసిడెన్సియల్ పాఠశాలల ఉపాధ్యాయులంతా ఒంటేరు గెలుపుకు కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు.

దంత వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా నజీముద్దీన్



కడప సెవెన్‌రోడ్స్ : దంత వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా కడప నగరానికి చెందిన డాక్టర్ షేక్ నజీముద్దీన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కర్నూలు నగరంలో సోమవారం జరిగిన సంఘ సర్వ సభ్య సమావేశంలో తనను ఎన్నుకున్నారని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. తనపై నమ్మకంతో అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు నాయకులు, సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల కోసం ఉచిత క్యాంపులు ఏర్పాటు చేస్తామని చెప్పారు.

రాయలసీమను ప్రత్యేక రాష్ట్రంగా చేయాలి

కడప రూరల్: కేంద్ర ప్రభుత్వం రాయలసీమను ప్రత్యేక రాష్ట్రంగా ప్రకటించాలని జాతీయ రాయలసీమ రాష్ట్ర సమితి అధ్యక్షుడు కుంచం వెంకటసుబ్బారెడ్డి అన్నారు. శనివారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతం అనాదిగా అన్ని రంగాల్లో వెనుకబడి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగంలోని ఆర్టికల్-3 ప్రకారం రాయలసీమను ప్రత్యేక రాష్ట్రంగా చేయాలన్నారు. అంటే వైఎస్సార్ జిల్లాతో పాటు కర్నూలు, చిత్తూరు, అనంతపురం, నెల్లూరు, ప్రకాశం, వేలూరు, కృష్ణగిరి, బళ్లారి, రాయచూరు, చిత్రదుర్గ కోలార్ ప్రాంతాలను కలిపి ప్రత్యేక రాష్ట్రంగా ప్రకటించాలని తెలిపారు. పార్లమెంట్ సమావేశాల్లో ప్రత్యేక బిల్లును ప్రవేశపెట్టి తీర్మానం చేయాలని పేర్కొన్నారు.

ఆక్రమణదారులపై కేసు నమోదు చేయాలి

కడప కార్పొరేషన్: కడప నగరంలోని 48వ డివిజన్ రామరాజుపల్లె పరిధిలోని నంద్యాల నాగిరెడ్డి కాలనీలో ఉర్దూ స్కూల్‌కు సంబంధించిన స్థలాన్ని ఆక్రమిస్తున్న వారిపై కేసు నమోదు చేయాలని సీపీఐ నగర కార్యదర్శి ఎస్. వెంకటశివ, తాలూకా జోన్ కార్యదర్శి సావంత్ సుధాకర్, వార్డు కార్యదర్శి కె. మునెయ్య డిమాండ్ చేశారు. సోమవారం వారు కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్‌కు వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్కూల్‌కు సంబంధించిన స్థలాన్ని ఓ మహిళ దౌర్జన్యంగా కబ్జా చేస్తుంటే నగరపాలక సిబ్బంది పనులను నిలిపి వేశారన్నారు. స్కూల్ స్థలానికి వెంటనే ప్రహరీ నిర్మించాలని, పరమేశ్వర స్కూల్ నుంచి హోమియోపతి కాలేజ్ వరకూ సీసీ రోడ్డు నిర్మించాలని కోరారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ వెంటనే రహదారి పనులను మొదలు పెట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. బాబావలీ, లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

హెల్మెట్, సీటు బెల్ట్ ధరించండి

కడప అర్బన్: హెల్మెట్, సీటు బెల్ట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు, తమ సిబ్బందితో కలిసి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మొత్తం 277 కేసులను నమోదు చేశారు. ఇందులో హెల్మెట్ లేని కేసులు 277 ఉన్నాయి.సీట్ బెల్ట్ ధరించని వారిపై 21 కేసులు నమోదు చేశారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు



స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్: విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తప్పవని కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ హెచ్చరించారు. సోమవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన 13వ డివిజన్‌లో పర్యటించి పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించారు. కొత్తగా వేసిన రోడ్లకు సంబంధించి నాణ్యతను తనిఖీ చేసి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు రోడ్లు, కాలువల్లో చెత్త వేయకుండా అవగాహన కల్పించాలన్నారు. క్లాప్స్ ఆటోలు ప్రతి రోజూ మూడుసార్లు చెత్త ఎత్తేలా చూడాలన్నారు.

స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి

స్పందన కార్యక్రమంలో వచ్చే అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని కమిషనర్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలోని వీసీ హాలులో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 54 అర్జీలు రాగా, అందులో ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి 20, టౌన్ ప్లానింగ్-10, రెవెన్యూ విభాగం-9, పబ్లిక్ హెల్త్ విభాగం-5, సచివాలయాలు-5, కడప తహసీల్దార్-2, యూపీఏ విభాగం- 1, జిల్లా ఉపాధి కార్యాలయం-1, సీడీపీఓ-1 అర్జీలు వచ్చాయి. వీటిని సమగ్రంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఏసీపీ నాగేంద్ర, ఆర్ఓ లు, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, డీఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

మహాత్మాగాంధీకి ఘన నివాళి .. జాతిపిత మహాత్మా గాంధీకి నగరపాలక కమిషనర్ ప్రవీణ్‌చంద్, కార్పొరేటర్లు ఘన నివాళి అర్పించారు. సోమవారం గాంధీ వర్ధంతి సందర్భంగా కార్పొరేషన్ కార్యాలయం వద్దనున్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఎస్ఈ రత్నాల రాజు, సీపీ సంజీవ్ కుమార్, ఎంహెచ్ఓ డా.ప్రశాంత్‌వర్ధన్, వైఎస్సార్‌సీపీ నాయకులు రెడ్డిప్రసాద్, సూర్యనారాయణరావు, రామక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

పోతురాజు మరణం తీరని లోటు



వెంకట సుబ్బన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బ్రౌన్ కేంద్రం ప్రతినిధులు, సిబ్బంది

కడప కల్చరల్: సాహితీవేత్త పోతురాజు వెంకటసుబ్బన్న మరణం ఆ రంగానికి తీరని లోటని బ్రౌన్ కేంద్రం బాధ్యులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో సోమవారం రచయిత, చరిత్ర పరిశోధకులు పోతురాజు వెంకట సుబ్బన్న సంస్మరణ సభ నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి బ్రౌన్ కేంద్రం సలహామండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్, పోతురాజు వెంకట సుబ్బన్న కుటుంబ సభ్యులు, పరిశోధన కేంద్రం సిబ్బంది ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ వెంకట సుబ్బన్న ఉత్తమ ఉపాధ్యాయుడిగా, చరిత్ర పరిశోధకుడిగా, రచయితగా, సాహితీవేత్తగా బహుముఖ ప్రజ్ఞ కనబరిచారని కొనియాడారు. జానమద్ది విజయభాస్కర్ మాట్లాడుతూ సిద్దవటం చరిత్రనువెలుగులోకి తెచ్చి దానికి గుర్తింపు కల్పించిన వెంకటసుబ్బన్న కృషిని మరువలేమన్నారు. వైవీయూ జర్నలిజం శాఖ అధ్యాపకులు డాక్టర్ తుమ్మలూరు సురేష్‌బాబు, బ్రౌన్ కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, గ్రంథ పాలకులు ఎన్. రమేష్‌రావు, జి.హరిభూషణరావు మాట్లాడారు. వెంకటసుబ్బన్న కుమారుడు సుభాష్‌బాబు, మనవమరాలు విద్యాభారతి పాల్గొన్నారు.

ప్రజల నడ్డి విరుస్తున్న ప్రభుత్వాలు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఓబులేసు

కడప కోటిరెడ్డిసర్కిల్/ వైఎస్సార్ సర్కిల్: ప్రజల నడ్డి విరిచే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఓబులేసు తెలిపారు. సోమవారం నగరంలోని వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తోందన్నారు. ప్రపంచ చరిత్రలో అతి తక్కువ సమయంలో ఎక్కువ ఆస్తులు కూడ పెట్టుకున్న వారు లేరన్నారు. నరేంద్రమోడీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎనిమిది సంవత్సరాలలోనే గౌతమ్‌అదాని, రిలయన్స్ అంబానీల ఆస్తులు పెరిగాయన్నారు. ప్రపంచ కుబేరులు రెండు, మూడు స్థానాలలో నిలిచారన్నారు.నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత 8సంవత్సరాలలోనే 18లక్షల కోట్ల రూపాయలు రద్దు చేసిందని మండిపడ్డారు. సంపన్నులపై మూడు శాతం పన్ను పెంచితే దేశంలో విద్య, వైద్యం ఇతర మౌళిక సదుపాయాలు చేయవచ్చన్నారు. పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ అభ్యర్థి నాగరాజును గెలిపించాలని ఆయన కోరారు. ఈసమావేశంలో పశ్చిమ రాయలసీమ అభ్యర్థి నాగరాజు, సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకట శివ,సుబ్బారెడ్డి, కేసీ బాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాలకు సిద్ధం అవుదాం

– ఏపీ ఎమ్మార్పీస్ రాష్ట్ర అధ్యక్షులు దండు వీరయ్య



మాట్లాడుతున్న దండు వీరయ్య మాదిగ

కడప రూరల్: క్షేత్ర స్థాయిలో ఏపీ ఎమ్మార్పీస్‌ను బలోపేతం చేసి సమస్యల పరిష్కారానికి చేపట్టే ఉద్యమాలకు సిద్ధం అవుదాం అని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దండు వీరయ్య మాదిగ తెలిపారు. సోమవారం స్థానిక యూటీఎఫ్ భవన్‌లో గ్రామస్థాయిలో ఏపీ ఎమ్మార్పీస్ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన దండు వీరయ్య మాట్లాడుతూ రాబోవు కాలంలో ఏపీ ఎమ్మార్పీస్ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణతో పాటు చర్మకారులు, డప్పు కళాకారులు తదితర అంశాలపై పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టడానికి సన్నద్ధం అవుతోందన్నారు. తక్షణం కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు చర్యలు చేపట్టాలని కోరారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు బీసీ గంగులు, రాష్ట్ర నాయకులు ఆంజనేయులు పాల్గొన్నారు.

గ్లోబల్ కళాశాల విద్యార్థుల ప్రతిభ



లక్ష్మితేజ



నరేంద్రబాబు



కీర్తి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాలలో ద్వితీయ, తృతీయ సంవత్సరాల్లో డిప్లొమా చదువుతున్న విద్యార్థులు స్టేట్‌బోర్డు ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ నిర్వహించిన మూడవ, ఐదవ సెమిస్టర్ ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించి తమ ప్రతిభ కనబరిచారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రామసుబ్బమ్మ తెలిపారు. డిప్లొమా మూడు, ఐదవ సెమిస్టర్లు చదువుతున్న ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విద్యార్థి నరేంద్రబాబు 99 శాతం, కె.కీర్తి 94, గీత 90.4, స్వాతి 91.5, సుభాన్ 90.5, అరుణేశ్వరి 91.8, దనలక్ష్మి 88, శ్రీ సాహితీ 87.6, రెండవ సంవత్సరం మూడవ సెమిస్టర్‌లో కంప్యూటర్ ఇంజనీరింగ్ చదువుతున్న ఎం.లక్ష్మితేజ 92, అనిత 82, చంద్రశేఖర్ 88, భక్తియార్ అహ్మద్ 87, ఈసీఈ విభాగంలో సంపత్ 85, తౌసిల్ 82 శాతం మార్కులతో ప్రతిభ చాటారన్నారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ కొమ్మా రాంపవన్‌రెడ్డి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. విభాగాధిపతులు ఫరూఖ్ అన్వర్, శాలివాహనరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా గ్రామోత్సవం



ప్రత్యేక పూజలందుకొన్న నల్లనమ్మ తల్లి

వీరపునాయునిపల్లె: మండలంలోని కీర్తిపల్లె గ్రామంలోని నల్లనమ్మ ఆలయ ద్వితీయ వార్షికోత్సవాలలో భాగంగా సోమవారం అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా సాగింది. గ్రామోత్సవంలో ఏర్పాటు చేసిన చెక్కభజన భక్తులను ఎంతగానో అలరించింది. ఆలయ ప్రధాన అర్చకుడు ఉమామహేశ్వర శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కుంకుమార్చన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మహిళలు భక్తి శ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా నిర్వహించిన హోమ కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు, అగ్నిగుండం ప్రవేశ కార్యక్రమంలో యువకులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం ఆలయ చైర్మన్ విజయ్‌కుమార్ రెడ్డి దంపతులు కీర్తిపల్లె ఆడబిడ్డలకు పసుపు, కుంకుమ, చీర అందజేశారు.

నేడు బండలాగుడు పోటీలు

నల్లనమ్మ ఆలయ తృతీయ వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం 8 గంటలకు ఒంగోలు జాతికి చెందిన న్యూ కేటగిరి వృషభ రాజములచే బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాలను ప్రారంభించేందుకు ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి హాజరు కానున్నట్లు ఆయన తెలియజేశారు.

వెన్నపూస గెలుపునకు సహకరించండి

కడప కార్పొరేషన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డికి గెలుపునకు సహకరించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రతాప్‌రెడ్డి, కొట్టం రాము కోరారు. సోమవారం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి హాజరైన డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి, వ్యవసాయశాఖ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, ఏపీ సోషల్ వెల్ఫేర్‌బోర్డు చైర్మన్ పులి సునీల్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డిని కలిసి వెన్నపూస విజయానికి సహకరించాలని అభ్యర్థించారు. ఇందుకు వారు సానుకూలంగా స్పందించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్. వెంకట్రామిరెడ్డి, చంద్రశేఖర్, ప్రసాద్, మల్లేశ్వర తదితరులు పాల్గొన్నారు.

అదానీ పెట్టుబడులపై ఆందోళన వద్దు

కడప కల్చరల్: అదానీ సంస్థలకు సంబంధించిన షేర్లలో ఎల్ఐసీ పెట్టుబడుల పట్ల ఆందోళన అవసరం లేదని కడప ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ కె.గిరిధర్ తెలిపారు. అదాని డెట్ సెక్యూరిటీలలో ఎల్ఐసీ కలిగి ఉన్న అన్ని సెక్యూరిటీల క్రెడిట్‌రేటింగ్ ఏఏ కంటే ఎక్కువని అంటే చాలా భద్రమైన పెట్టుబడులని ఆయన వివరించారు. ఎల్ఐసీ పెట్టుబడులన్నీ అన్నీ జీవిత బీమా కంపెనీలకు వర్తించే విధంగా ఐఆర్‌డీఏఐ యొక్క పెట్టుబడి నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయన్నారు. 2022 సెప్టెంబరు 30 నాటికి ఎల్ఐసీ నిర్వహణలో ఉన్నమొత్తం ఆస్తుల విలువ రూ. 41.66 లక్షల కోట్లు. అయితే అదాని గ్రూపులో ఎల్ఐసీకి గల మొత్తం పెట్టుబడుల విలువ ఎల్ఐసీ నిర్వహణలో ఉన్న మొత్తం ఆస్తుల విలువలో కేవలం 0.975 శాతం మాత్రమేనని ఆయన వివరించారు. ఎల్ఐసీ 66 సంవత్సరాలుగా ఖచ్చితమైన పెట్టుబడి ఫ్రేమ్‌వర్క్‌ను అనుసరిస్తూనే ఉందన్నారు. ఎల్ఐసీ తన పాలసీదారులు, వాటాదారుల ఆర్థిక భద్రత కోసం బాధ్యతగా వ్యవహరిస్తుందన్న విషయాన్ని ప్రజలు, ఇన్వెస్టర్లు, పాలసీదారులు గుర్తించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మార్వాడీ సేఠ్‌ల వేధింపులను అరికట్టాలి

కడప కోటిరెడ్డిసర్కిల్/వైఎస్సార్ సర్కిల్: బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టి మూడు రూపాయలు చెల్లిస్తున్నప్పటికీ మార్వాడీ సేఠ్‌ల వేధింపులు అధికమయ్యాయని అలాంటి వారి లైసెన్సులను రద్దు చేయాలని రాయలసీమ మహిళా సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తస్లీం, లక్ష్మిదేవి తెలిపారు. సోమవారం ఆర్పీపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కుటుంబ అవసరాల రీత్యా అత్యవసర పరిస్థితులలో బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టుకొని ఇచ్చిన డబ్బుల వడ్డీ వసూళ్లతో అత్యంత అవమానకరండా మాట్లాడుతున్నారన్నారు. అలాగే వడ్డీల వసూళ్ల కోసం ఇళ్ల దగ్గరకు వచ్చి వీధిలోని అందరి ముందు అవమానకరంగా మాట్లాడుతున్నారని తెలిపారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్/వైఎస్సార్ సర్కిల్: మునిసిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు కేసీ బాదుల్లా, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి కోరారు. సోమవారం రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా కలెక్టరేట్ వద్ద నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఫేస్ రికగ్నైజ్డ్ సిస్టమ్‌ను మునిసిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులకు రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. అలాగే సుప్రీం కోర్టు, హైకోర్టు తీర్పుల ప్రకారం సమానపనికి సమాన వేతనం చెల్లించాలని కోరారు. ఏఐటీయూసీ నగర అధ్యక్ష కార్యదర్శులు సుబ్బరాయుడు, మద్దిలేటి, మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్షులు నరసింహులు, కోశాదికారి వెంకటాద్రి పాల్గొన్నారు.

హజ్ హౌస్‌ను పునఃప్రారంభించాలని వినతి



డిప్యూటీ సీఎం అంజద్‌బాషాకు వినతిపత్రమిస్తున్న హజ్‌హౌస్ యాక్షన్ కమిటీ నాయకులు

కడప కార్పొరేషన్: కడప నగరానికి సమీపంలోని హజ్ హౌస్‌ను పునఃప్రారంభించాలని కడప హజ్ హౌస్ యాక్షన్ కమిటీ సభ్యులు కోరారు. సోమవారం వారు డిప్యూటీ సీఎం అంజద్‌బాషాకు వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019లో ప్రారంభించబడిన హజ్‌హౌస్ దయనీయ స్థితిలో ఉందన్నారు. ఐదేళ్లు పూర్తవుతున్నా కనీసం సంరక్షణ కూడా లేని స్థితిలో హజ్ హౌస్ ఉందన్నారు. దాని చుట్టూ పిచ్చి మొక్కలు మొలిచి దారి కూడా మూసుకుపోయిందన్నారు. వెంటనే దాన్ని పునఃప్రారంభించి పూర్తిస్థాయిలో వసతులు సమకూర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ కన్వీనర్ సలావుద్దీన్, డా. గౌస్‌పీర్, కో కన్వీనర్ తన్వీర్ అహ్మద్, షబ్బీర్, ముఫ్తీ ఖాజీ ఇషాక్, కరిముల్లా, జహీర్, అన్వర్, రఫీక్ ఖాన్ పాల్గొన్నారు.

ఉరుసు పోస్టర్ల ఆవిష్కరణ

కడప కల్చరల్ : ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా సోమవారం తన కార్యాలయంలో మహల్ పట్టణానికి చెందిన ఉరుసు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దర్గా పీఠాధిపతి మాట్లాడుతూ ఫిబ్రవరి 11న గంధం ఉత్సవం, 12న ఉరుసు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉరుసురోజున ఖవ్వాలీ కచేరి ఉంటుందని తెలిపారు. ఈ ఉత్సవాలకు తప్పక రావాలని డిప్యూటీ సీఎంను ప్రత్యేకంగా ఆహ్వానించారు. ప్రభుత్వ ఖ్వాజీ సిరాజుద్దీన్ బుఖారి, జమీల్ బుఖారి, జహరుల్లా హుసేనీ, సయ్యద్ అబ్రాబ్, ఇలియాస్ ఖాద్రీ, సయ్యద్ సలావుద్దీన్, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

మహాత్ముని మార్గం అనుసరణీయం



అల్‌షిఫాలో మహాత్ముడికి నివాళి



జాతీయ మానవహక్కుల కార్యాలయంలో..

కడప సెవెన్‌రోడ్స్ : జాతిపిత మహాత్మాగాంధీ చూపిన మార్గం అందరికీ అనుసరణీయమని న్యాయవాది అమీన్‌పీరా అన్నారు. మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా కడప నగరం నాగరాజుపేటలోని జాతీయ మానవ హక్కుల కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. యునైటెడ్ ముస్లిం ఫోరం నాయకుడు రఫీఖాన్, హోమియో వైద్యులు శ్రీనివాసులు, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

కడప కల్చరల్ : మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా కడపనగరం పాత రిమ్స్‌లోని అల్‌షిఫా మానసిక వికలాంగుల పునరావాస కేంద్రంలో బీసీ సంఘం నాయకులు లింగమూర్తి, ఖాదర్‌బాషా గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశం కోసం గాంధీజీ చేసిన పోరాటాలు, త్యాగాల గురించిపిల్లలకు వివరించారు. కేంద్రంలోని బాలలకు చాకెట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అల్‌షిఫా వ్యవస్థాపకులు ఎస్.మహమ్మద్ రఫీ, ఉపాధ్యాయులు, పిల్లలు పాల్గొన్నారు.

యూరియా కొరత లేదు

కమలాపురం: కమలాపురం వ్యవసాయ డివిజన్ పరిధిలో యూరియా కొరత లేదని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. సోమవారం కమలాపురం మండలంలోని ఎరువుల దుకాణాలను ఏఓ సరస్వతితో కలసి ఆయన తనిఖీ చేశారు. స్టాక్ రిజిష్టర్, దుకాణాల్లో ఉన్న ఎరువుల నిల్వను తనిఖీ చేశారు. దుకాణదారులకు పలు సలహాలు, సూచనలు అందజేశారు. ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. మండలంలో 90 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. అలాగే ఆర్‌బీకేల్లో 8 మెట్రిక్ టన్నుల యూరియాతో పాటు అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎటువంటి కొరతలేదన్నారు.ఏఈఓ దస్తగిరి పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు చదిపిరాళ్ల క్రీడాకారులు ఎంపిక



ఆశ్రితారెడ్డిని అభినందిస్తున్న పీడీ చంద్ర ఓబుల్ రెడ్డి

కమలాపురం: మండలంలోని టి.చదిపిరాళ్లకు చెందిన ఇద్దరు క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కర్నూలులో ఈ నెల 28 నుంచి జరుగుతున్న ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో అండర్ -14 బాలికల విభాగంలో చదిపిరాళ్లకు చెందిన చాగారి ఆశ్రితారెడ్డి పాల్గొని ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానంలో నిలిచింది. అలాగే నంద్యాలలో జరుగుతున్న 66వ ఎస్‌జీఎఫ్ త్రోబాల్ స్టేట్ మీట్‌లో అదే గ్రామానికి చెందిన చల్లా విశ్వసాయి రెడ్డి పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచాడు. వీరిద్దరు త్వరలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని పీడీ చంద్ర ఓబుల్ రెడ్డి తెలిపారు. కాగా విజేతలకు నిర్వాహకులు, అతిథులు అభినందించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



క్రీడాకారిణులను అభినందిస్తున్న డీవీఈఓ, ప్రిన్సిపాల్

కడప స్పోర్ట్స్: సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టుకు కడప నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు నలుగురు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. సి. సూర్యారావు తెలిపారు. ఈనెల 28న రాయచోటిలో నిర్వహించిన జిల్లాస్థాయి సీఎం కప్ కబడ్డీ పోటీల్లో పాల్గొన్న కడప జట్టులో కళాశాల నుంచి క్రీడాకారులు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి డి. విష్ణుప్రియ, పి. నీలమహేశ్వరి, ఎల్.వాణి, ఎస్.ఉషశ్రీలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. వీరిని డీవీఈఓ శ్రీనివాసులరెడ్డి అభినందించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ అరుణకుమారి, క్రీడాకారిణులు పాల్గొన్నారు.

పరిశ్రమలతో జీవన ప్రమాణాలు పెంపొందించుకోవచ్చు

– పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి

పులివెందుల రూరల్ : చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని జీవన ప్రమాణాలు పెంపొందించుకోవచ్చునని పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని చిన్నరంగాపురం గ్రామ సమీపంలో ఉన్న ఫుడ్‌అండ్‌సైన్స్ కళాశాలలో కళాశాల డీన్ ఆధ్వర్యంలో ఫుడ్ ప్రాసెసింగ్‌పై రైతులకు, మెప్మా మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ జీవన ప్రమాణాలను పెంచుకునేందుకు వివిధ రకాల పదార్థాలను తయారు చేసుకుని ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసే విధంగా మార్కెట్ వసతులు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. చిన్న, చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవడంవల్ల మహిళలు అన్ని విధాలా ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చునన్నారు. బ్యాంకులు కూడా విరివిగా రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. మహిళలు, రైతులు వివిధ రకాల వ్యాపారాలు చేసుకునేందుకు ఆసక్తి గల వారు పాల్గొని అధికారులు చెప్పే సూచనలు, సలహాలు పాటించాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిల సహకారంతో పులివెందుల నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. గండికోట ప్రాజెక్టు ద్వారా నియోజకవర్గంలోని చక్రాయపేట మండలానికి నీరు ఇవ్వడం జరుగుతోందన్నారు. చిత్రావతి, పైడిపాలెం ప్రాజెక్టులలో 16టీఎంసీల నీరు ఉందన్నారు. చీనీ, అరటి పంటలకు మంచి దిగుబడి రావడానికి అన్ని వసతులు మన ప్రాంతాలలో ఉన్నాయన్నారు. రైతులకు కావాల్సిన అన్ని మౌళిక సదుపాయాలను కల్పించే విధంగా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం పదిలం

అట్లూరు : చిరుధాన్యాల ఆహారంతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు మత్రిపాటి నాగరాజ పేర్కొన్నారు. మండల పరిధిలోని ఆర్బీకే పరిధిలో సోమవారం చిరుధాన్యాల సాగు, వినియోగంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు మండల వ్యవసాయాధికారి రామకృష్ణయ్య మాట్లాడుతూ చిరుధాన్యాలను ప్రోత్సహించడానికి భారతదేశం చొరవతో ఐక్యరాజ్యసమితి 2023 సంవత్సరాలు అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిందన్నారు. చిరుధాన్యాల ఆహారంతో రక్తపోటు, మలబద్ధకం, క్యాన్సర్ లాంటి వ్యాధుల నివారణకు దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గంగమ్మ, తహసీల్దారు శ్రీవాణి, ఎంపీడీఓ సుజాతమ్మ, ఆర్బీకే వీఏఏ సందీప్‌కుమార్, రామ్మోహన్‌రెడ్డి, వెంకటసుధ తదితరులు పాల్గొన్నారు.